భూ సమస్యలకు పరిష్కారం

కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : సుదీర్ఘకాలంనాటి భూ సమస్యలన్నీ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడంతోపాటు నిరుపేదలకు భూమి పంపిణీ చేస్తున్నదని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. భూమి పంపిణీ, భూమి హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో నిర్వహించారు.

ఏలూరు జిల్లా నూజివీడులో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పేదలకు భూమి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రజలు తిలకించేలా అధికారులు ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేశారు. కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని వివేకానంద హాల్ నుండి హాజరైన జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతి కొరకే భూమి పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. దీర్ఘ కాలం సమస్యలకు సైతం ప్రభుత్వం పరిష్కార మార్గం చూపిందన్నారు. దశాబ్దాలుగా భూమి అనుభవిస్తున్న వారికే హక్కు పత్రాలను ప్రభుత్వం జారీ చేసిందన్నారు. ముఖ్యంగా భూముల రీ సర్వే ప్రక్రియతో సమస్యలన్నీ శాశ్వతంగా పరిష్కారమవుతున్నాయని తెలిపారు. జిల్లాలో 3264 మంది భూమిలేని లబ్ధిదారులకు 2649.69 ఎకరాల భూమి పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ భూములపై లబ్ధిదారులకు పూర్తి హక్కు లభిస్తుందని కలెక్టర్ వివరించారు. జిల్లాలో స్మశాన వాటికలు లేని గ్రామాలను గుర్తించి 2.30 ఎకరాల భూమిని గ్రామ పంచాయతీలకు అప్పజెప్పనున్నట్టు కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలో కొంతమంది లబ్ధిదారులకు భూ హక్కు పత్రాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, ఎంఎల్‌సి కర్రీ పద్మశ్రీ, కుడా మాజీ చైర్ పర్సన్ రాగి రెడ్డి చంద్రకళ దీప్తి, డిఆర్ఒ కె. శ్రీధర్ రెడ్డి, మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, ఎంఎల్‌సి కర్రీ పద్మశ్రీ, కుడా మాజీ చైర్ పర్సన్ రాగి రెడ్డి చంద్రకళ దీప్తి, డిఆర్ఒ కె. శ్రీధర్ రెడ్డి, కాకినాడ ఆర్‌డిఒ ఐ. కిషోర్, తహసీల్దార్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి 1 సచివాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే సీఎం ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు బద్రి బాబ్జి, గ్రామ సర్పంచ్ పెయ్యాల రాజ్ కుమార్, జడ్పిటిసి గెడ్డం సంపద రావు, మండల ఆర్బికె చైర్మన్ మానే శ్రీను, జిల్లా రైతు విభాగం అధ్యక్షులు జున్నూరి వెంకటేశ్వర రావు, చల్లపల్లి సచివాలయంలో 2లో మండల సచివాలయాల కన్వీనర్ కోటుం లోవరాజు, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఓగూరి విజయకుమార్, ఏఎంసి చైర్మన్ బడుగు మేరీ కుమారి, సొసైటీ అధ్యక్షుడు దంగేటి దొరబాబు, బోగిశెట్టి నర్సింగ రావు, కోరుకొండ కిరణ్, కన్వీనర్ బీర బాలరాజు, ఇతర గ్రామ కన్వీనర్లు, గృహ సారధులు పాల్గొన్నారు.

డిజిటలైజేషన్ క్లాసులపై విద్యార్ధులకు అవగాహన

విశాలాంధ్ర - కరప : జాతీయ గ్రంథాలయ 56వ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం వేలంగి శాఖ గ్రంథాలయంలో ఐదు, ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు విద్యా వ్యవస్థలో డిజిటలైజేషన్ క్లాసులు పై అవగాహన కల్పించినట్టు గ్రంథాలయ సేవకులు పివి వెంకటరంగయ్య తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖన, గ్రామపంచాయతీ విధులు తదితర అంశాలపై విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు జానా విజన, జిల్లా కార్యదర్శి వడ్లమూరి రామారావు, పట్టా కృపారావు, అప్పారావు, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

పురాణపండ ట్రస్ట్‌చే రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట పురాణపండ సత్యనారాయణమూర్తి హరి కుసుమాంబ చారిటబుల్ ట్రస్టుచే జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని రోగులకు పండ్లు, రొట్టెలు, రోడ్డుపై ఉండే యాచకులకు భోజనాలు పంపిణీ చేశారు. ట్రస్టును ఏర్పాటు చేసి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు శేష సాయి శర్మ ఆధ్వర్యంలో జగ్గంపేట సిహెచ్‌సిలోని రోగులకు రొట్టెలు, పండ్లు ఎస్ఐ నాగార్జున రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం మెయిన్ సెంటర్‌లో ఉన్న యాచకులకు భోజనం ప్యాకెట్స్ శర్మ అందజేశారు. ఈ సందర్భంగా శేష సాయి శర్మ మాట్లాడుతూ తన తాతయ్య పేరు మీద ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆపదలో ఉన్నవారికి సహాయం చేయాలనే ఉద్దేశ్యంతో ఈ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఆమ్‌ఆద్మీ సమావేశానికి భారీగా తరలిరావాలి

విశాలాంధ్ర - మామిడికుదురు : ఈ నెల 26న ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ నల్లి శ్రీనివాస్, రాజోలు మండల ఇంచార్జి ఈతకోట కాళేశ్వరరావు అన్నారు. కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లు, భవిష్యత్ కార్యాచరణకు ఈ నెల 19వ తేదీన రావులపాలెంలో కోనసీమ హోటల్ దగ్గర సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సమావేశానికి ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని వారు పేర్కొన్నారు.

అధ్వాన రోడ్లలో నిరసన

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రోడ్లను పరిశీలించి నిరసన చేయడం జరుగుతుందని టిడిపి, జనసేన పార్టీల శ్రేణులు హాజరుకావాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. జగ్గంపేట నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో నెహ్రూ మాట్లాడారు. టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి ఆదేశాల మేరకు నాలుగు రోజుల పాటు నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రోడ్లలో పాదయాత్ర నిర్వహించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేయనున్నట్టు తెలిపారు. 19న రామవరం, రాజుపాలెం రోడ్డు పరిశీలిస్తామని, 20న గోకవరం నుండి రంపయర్రంపాలెం, గోకవరం తంటికొండ రోడ్లు పాదయాత్ర ద్వారా పరిశీలించనున్నట్టు తెలిపారు. 21న జగ్గంపేట మండలం మన్యంవారిపాలెం నుండి కృష్ణాపురం, రామవరం నుండి మర్రిపాక రోడ్లను, 22న గండేపల్లి మండలం గండేపల్లి నుండి రామయ్యపాలెం సింగరంపాలెం రోడ్డును, ఉప్పలపాడు రోడ్డు పరిశీలించి పాదయాత్ర చేయనున్నట్టు తెలిపారు.



మహేంద్ర ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి

విశాలాంధ్ర-పెరవలి : తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం దొమ్మేరు గ్రామానికి చెందిన మహేంద్ర ఆత్మహత్యకు కారకులైన వారిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబానికి రూ.20 లక్షలు నష్టపరిహారం వెంటనే అందించాలని తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి డిమాండ్ చేస్తూ శుక్రవారం పెరవలి మండలం ముక్కామల గ్రామంలో గల తన నివాసం నుండి ఒక ప్రకటన ద్వారా విలేకరులకు తెలిపారు. ఈవిషయంలో మహేంద్ర కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆమె తెలిపారు.

వైసీపీ పాలనలో దళితులకు రక్షణ కరువు

- హోం మంత్రి రాజీనామా చేయాలి
- మహేంద్ర మృతికి కారకులను శిక్షించాలి
- సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి అరుణ్ డిమాండ్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత సొంత నియోజకవర్గంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆ పార్టీలో జెడ్పీటీసీ బంధువు బొంతు మహేంద్ర మృతికి నైతిక బాధ్యత వహిస్తూ హోం మంత్రి రాజీనామా చేయాలని సిపిఐ, సిపిఎం పార్టీలు శుక్రవారం స్థానిక శ్యామల జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించాయి. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి అరుణ్ మాట్లాడుతూ దొమ్మేరులో వైసీపీ నాయకులు ఏర్పాటుచేసిన స్వాగత ఫ్లెక్సీ పై ఉన్న ముదునూరి నాగరాజు, బోలిన సతీష్ తలకాయలను ఎవరో అగంతుకులు కట్ చేశారని, దీనిపై ఎస్సై బొంతు మహేంద్రను ఈనెల 13వ తేదీన పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి మానసిక ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. మనస్థాపానికి గురైన మహేంద్ర తన చావుకు ప్రధాన కారకులను చెప్పి ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. దీనికి ప్రధాన కారణం హోం మంత్రి, ఆమె కార్యాలయ సిబ్బంది పోలీసులకు ఫోన్ చేసి ఒత్తిడి తెచ్చారని, అందువల్ల నైతిక బాధ్యత వహిస్తూ హోం మంత్రి రాజీనామా చేయాలని వీరు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎప్పుడు లేనంతగా తూర్పు గోదావరి జిల్లాలోనే ఎక్కువగా దాడులు జరుగుతున్నాయని వారన్నారు. మృతుడి కుటుంబానికి కనీసం 50 లక్షల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళుతున్న ప్రజాసంఘాలను, ప్రతిపక్ష పార్టీలను గృహనిర్బంధం చేయడం దారుణం అన్నారు. ఈ ధర్నాకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు ,నగర కార్యదర్శి వి. కొండలరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, సీనియర్ నాయకులు ఎస్ ఎస్ మూర్తి, జట్టు సంఘం ప్రధాన కార్యదర్శి సప్పరమణ, అధికార పార్టీ సభ్యులు ఆర్. వెంకట్రావు, జి. వెంకట్రావు, కాళ్ల అప్పల నాయుడు, నల్ల రామారావు, మహిళా సమాఖ్య జిల్లా కో కన్వీనర్ ఎం.ముత్యాలు, ఏఐఎస్ఎఫ్ నగర కన్వీనర్ ఎం. స్టాలిన్, సీపీఎం నాయకులు ఐ.సుబ్రహ్మణ్యం, వి. రాంబాబు, బి. రామకృష్ణ, సోమేశ్వరరావు తదితరులు నాయకత్వం వహించారు.

సమగ్ర కులగణన నిర్వహణకు అధికారులు సమాయత్తం కావాలి

-ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

-మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో చేపట్టబోతున్న సమగ్ర కుల గణన సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమాయత్తం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కులగణన ప్రక్రియ నిర్వహణకు తీసుకోవలసిన చర్యలు, గృహ నిర్మాణాల గ్రౌండింగ్, ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు, వై ఏపీ నీడ్స్ జగన్, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, జగనన్న పాలవెల్లువ పథకం కింద పాడి రైతులకు రుణాల మంజూరు, జగనన్న విద్యా దీవెన పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఉమ్మడి బ్యాంకు ఖాతాలు వంటి అంశాలపై జిల్లా కలెక్టర్.. క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కులగణన కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు సమాయత్తం కావాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు గ్రామస్థాయిలో సచివాలయం, వాలంటీర్ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ఇంటింట సర్వే నిర్వహించాలన్నారు. కులగణన వివరాలు నమోదు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించిందని, దీని వినియోగంపై సిబ్బందికి త్వరలోనే శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా స్థాయిల్లో క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. ఈ నెల 20 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు కిట్ల పంపిణీ, క్రీడా మైదానాలు, క్రీడా శిక్షకుల ఎంపిక వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేసిన నూతన మార్పులకు అనుగుణంగా తల్లి, విద్యార్థికి కలిపి ఒకే బ్యాంకు ఖాతా ఉండాలన్నారు. ఆయా బ్యాంకుల అధికారులతో సంప్రదించి వెంటనే మార్పులు చేయాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సమావేశంలో సీపీవో పీ.త్రినాథ్, హౌసింగ్ పీడీ బి.సుధాకర్ పట్నాయక్, డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, జేడీ సోషల్ వెల్ఫేర్ డీవీ రమణ మూర్తి, సెట్రాజ్ సీఈవో బి. శ్రీనివాస కుమార్, ఎల్డీఎం సీహెచ్ఎస్వీ.ప్రసాద్, ఆర్డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్లు ఎం.శ్రీనివాసు, బి.సత్యనారాయణ మూర్తి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి-సంక్షేమంలో ఏపీ సేవలకు గుర్తింపు

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రప్రదేశ్‌లో అమలు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నాయని కాకినాడసిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 5వ డివిజన్ పరిధిలోని సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే ద్వారంపూడి పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ద్వారంపూడి మాట్లాడుతూ గత, ప్రస్తుత ప్రభుత్వ పనితీరును బేరీజు వేసుకుని వచ్చే ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పును వెల్లడించాలని కోరారు. ఐదో డివిజన్లో వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల కింద 32 కోట్ల రూపాయలు ఖర్చు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - కాజులూరు : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి. అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయాధికారులు పర్యటించి ఆర్బికేలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తర్లంపూడిలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 23 ఆరికేలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ధాన్యం మద్దత్తు ధర 75 కేజీల బస్తా రూ.1637కి కొనుగోలు చేస్తున్నామన్నారు. బయట మార్కెట్లో కొందరు దళారులు రైతులను నమ్మించి తక్కువ ధరకు ధాన్యాన్ని పట్టుకుపోతున్నారని రైతులు వారి మాటలకు మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో పంటను విక్రయించి గిట్టుబాటు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరాక బాలరాజు, స్థానిక వైఎస్సార్సీపీ గ్రామ కమిటీ చైర్మన్ సువ్వారి గోవిందు, పెంకే వెంకటరమణ, స్థానిక విఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఆదిత్య అసోసియేట్ ప్రొఫెసర్ నారాయణరావుకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా సంస్థలకు చెందిన ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో ఈసీఈ ఇంజనీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న నారాయణరావుకు "విట్ యూనివర్శిటీ అమరావతి" ఆంధ్ర ప్రదేశ్ నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (డాక్టరేట్) పొందినట్లు ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలియజేసారు.

ఓటు వజ్రాయుధం.. కలెక్టర్ మాధవీలత

విశాలాంధ్ర:రాజమహేంద్రవరం రూరల్ :ఓటు లేని వ్యక్తులు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఓటరుగా నమోదు కు ముందుకు రావడం తో పాటు ఎన్నికల్లో ఓటు వేయాల్సి ఉందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వై జంక్షన్ వద్ద స్వీప్ - ఓటరు అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కియోస్కోని ప్రారంభించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, భారత దేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం అని, ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడం జరుగుతోందని అన్నారు. అందుకు కారణం మన ఎన్నికల వ్యవస్థ అమలు చేస్తున్న విధి విధానాలు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, మునిసిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్, డిపివో జేవి సత్యనారాయణ, అదనపు కమిషనర్ పి ఎమ్ సత్య వేణి, జిల్లా అధికారులు, కాలేజీ, మునిసిపల్ స్కూల్ విద్యార్థులు, ఆర్ ఎం సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనసందోహమైన కొత్తపేట

చిర్ల జగ్గిరెడ్డి సారధ్యంలో సామాజిక సాధికార బస్సు యాత్ర

విశాలాంధ్ర - రావులపాలెం : వైసీపీ చేపట్టిన ప్రజా సాధికారత బస్సు యాత్ర శుక్రవారం రావులపాలెంలో జరిగింది. దాదాపు 5000 ద్విచక్ర వాహనాలు, సుమారు వంద కార్లతో, 300 ఆటోలతో రావులపాలెం నుంచి కొత్తపేట వైపుగా కొనసాగింది. ఈ యాత్రలో సుమారు 15 వేల మంది ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన సాంఘిక సంక్షేమ బస్సుయాత్రపై యువత జై జగన్ నినాదాలతో నిర్వహించిన బైక్ ర్యాలీ రావులపాలెం కళా వెంకటరావు సెంటర్‌కు చేరుకుంది. మంత్రులు చెల్లుబోయిన వేణు, మేరుగు నాగార్జున, కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంపీ మార్గాని భరత్, చింతా అనురాధ, ఎమ్మెల్సీ పండు రవీంద్రబాబు, కుడుపూడి సూర్యనారాయణరావు, పోతుల సునీత మాట్లాడారు.

బీసీ రౌండ్ టేబుల్ సమావేశం జయప్రదం చేయండి

విశాలాంధ్ర - రాజానగరం : జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో శనివారం జరగనున్న జిల్లా స్థాయి బీసీ రౌండ్ టేబుల్ సమావేశాన్ని బీసీ సోదరులు ప్రతిఒక్కరు జయప్రదం చెయ్యాలని యాదవ సాధికారిక కమిటీ జిల్లా అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు అన్నారు.మండలం లోని దివాన్ చెరువు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు విశాలాంధ్రతో శుక్రవారం చరవాణిలో మాట్లాడారు. బీసీ వర్గానికి జరిగిన అన్యాయం, తదితర అంశాలపై18వ తేదీన రాజమహేంద్రవరంలోని ఆనంద రీజెన్సీలో జరగనున్న జిల్లా స్థాయి బీసీ రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర స్థాయి నాయకులు, పెద్దలు,అఖిల పక్ష పార్టీ నేతలు హాజరవుతున్నట్లు చెప్పారు.వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ వర్గానికి చెందిన వారిని అన్ని విషయాల్లో అణగతొక్కారన్నారు.స్థానిక సంస్థల్లో 34 శాతం రిజ్వేషన్ల నుండి 22 శాతానికి తగ్గించిందని దుయ్యబట్టారు.

ఒక్క రైతు కూడా నష్టపోకూడదు

-రాష్ట్ర పౌరసరఫరాశాఖ ఎండీ వీరపాండ్యన్ వెల్లడి

-ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సమీక్ష

విశాలాంధ్ర - ఆలమూరు : రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించే సమయంలో ఒక్క రైతు కూడా నష్టపోకూడదని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మేనేజింగ్ డైరెక్టర్ వీరపాండ్యన్ అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మండల కేంద్రమైన ఆలమూరులో శుక్రవారం ధాన్యం కొనుగోలు, రైతు సమస్యలపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ నపూర్ అజయ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎండీ వీరపాండ్యన్ పాల్గొని ప్రసంగించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఏవిధమైన సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే సత్వరమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులకు సర్కియెన గిట్టుబాటు ధర, వ్యయ ప్రయాసలు లేకుండా సులభతరమైన చెల్లింపులే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారన్నారు. అనంతరం స్థానిక రైతులు లేవనెత్తిన సందేహాలను వారు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఓలేటి బోసుబాబు, డీసీఓ ఏ రాధాకృష్ణ, ఆర్‌డీఓ ఎం ముక్కంటి, రవాణశాఖ అధికారి డి అశోక్ ప్రతాపరావు, తూనికలు, కొలతలు జిల్లా అధికారి కె రాజేష్, డీఎస్పీ కెవి రమణ, స్థానిక తహసీల్దార్ ఐపి శెట్టి, ఏడీఏ కాకి నాగేశ్వరరావు, ఏఓ లక్ష్మీ లావణ్య, సర్పంచ్ నాతి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కొండ అక్రమ తవ్వకాలపై తనిఖీలు

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో అక్రమ కొండ తవ్వకాల పై తనిఖీలు జరిగాయి. అనుమతులు లేకుండా కొండ తవ్వకాల జరుగుతున్నాయని ఫిర్యాదు మేరకు శుక్రవారం స్థానిక రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో మైన్స్ అధికారులు పలు రికార్డులను పరిశీలించారు. దీనిపై తహసీల్దార్ కృష్ణారావు మాట్లాడుతూ అక్రమ తవ్వకాల పై అధికారులకు మెమోలు ఇచ్చామన్నారు. మైన్స్ అధికారులకు కూడా తెలియచేశామని అన్నారు. ఈ తనిఖీల్లో ఐ జి జియాలజిస్ట్ విఘ్నేష్, సర్వేయర్ అజిత, అధికారులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

త్వరలో వినియోగంలోకి కొండయ్యపాలెం ఫ్లై ఓవర్

- ముత్తా గోపాలకృష్ణ వారధిగా నామకరణం

- ముఖ్యమంత్రితో ప్రారంభానికి ఏర్పాట్లు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ కొండయ్యపాలెం ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేస్తామని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి చెప్పారు. ఈ ఫ్లై ఓవర్‌కు మాజీ మంత్రి ముత్తా గోపాలకృష్ణ వారధిగా నామకరణం చేసినట్టు తెలియజేశారు. ఫ్లై ఓవర్ నిర్మాణ పనులుతో పాటు అనుసంధానంగా చేస్తోన్న జంక్షన్ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ 2009లో కొండయ్యపాలెం ఫ్లై ఓవర్ నిర్మాణానికి శంఖుస్థాపన జరగ్గా ఆ తరువాత టీడీపీ హయాంలో నిర్లక్ష్యం వల్ల పనులు ముందుకు సాగలేదన్నారు. నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి నిధులను విడుదల చేయించి పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తున్నామన్నారు. వచ్చే నెలలో సీఎం చేతుల మీదుగా ఫ్లై ఓవర్‌ను ప్రజలకు అంకితం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, నగరపాలక సంస్థ ఎస్ఈ సత్యకుమారి, డిఈ సుబ్బారావు, ఏఈ వై నాగేశ్వరరావు, స్మార్ట్‌సిటీ మాజీ ఛైర్మన్ అల్లి రాజబాబు, మాజీ కార్పొరేటర్లు బాలాప్రసాద్, కర్రి శైలజ, మార్కెట్‌కమిటీ మాజీ డైరెక్టర్ కర్రి అనంతలక్ష్మి, నాయకులు అజ్జు, గూటాల రామకృష్ణతదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు 4వ రోజులో భాగంగా శుక్రవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. బి. సూర్యనారాయణ విశ్రాంత ఉపాధ్యాయులు, కె. మెహర్ గంగాధర్, అసిస్టెంట్ విజిటింగ్ ప్రొఫెసర్, జెఎన్‌టీయు కాకినాడ వారు పర్యవేక్షకులుగా ఉన్నారు. ముందుగా కె. మెహర్ గంగాధర్, అసిస్టెంట్ విజిటింగ్ ప్రొఫెసర్, జెఎన్‌టీయు కాకినాడ మాట్లాడుతూ గ్రంథాలయాలు-జ్ఞానానికి వేదిక లని, గ్రంథ పఠనం అజ్ఞాన హరణమని, గ్రంథాలయాలు ఇలలో కొలువైన దేవాలయాలని, విద్య అజ్ఞానంపై సంబంధించిన వజ్రాయుధమైతే, అజ్ఞాన గాఢాంధ కారాన్ని తొలగించే అక్షర హారం పుస్తకమని అన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు బి.సూర్యనారాయణ మాట్లాడుతూ దైవం కొలువున్న ప్రదేశం దేవాలయమైతే, జ్ఞాన జ్యోతిని వెలిగించే దేవాలయం గ్రంథాలయమని అన్నారు. ఉప గ్రంథాలయాధికారి కె. కిషోర్ మాట్లాడుతూ ఎంతో మంది అభ్యుదయ వాదులు, సంఘసంస్కర్తలు గ్రంథాలయోద్యమంలో పాల్గొని గ్రంథాలయాల స్థాపనకు విశేష కృషి చేసారని తెలిపారు. శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కవి సమ్మేళనం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

రాజకీయ బిందువైన అనపర్తి కెనాల్‌రోడ్డు

విశాలాంధ్ర - అనపర్తి : గత నెల 29న రాజకీయ బిందువుగా అనపర్తి కెనాల్ రోడ్ అనే శీర్షికన "విశాలాంధ్ర"లో వెలువడిన వార్త మరోసారి నిజమైంది. 2019 అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అనపర్తి నుండి బిక్కవోలు వరకు పాదయాత్ర చేయడం జరిగిందని మళ్ళీ అదే రోడ్డు కోసం అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత ప్రతిపక్ష నేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మైలేజ్ పెంచుకోవడానికి నిరసన యాత్రకు సిద్ధపడు తున్నారని ముందుగానే ప్రచురించిన వార్త శనివారం నిజం కానుంది. అనపర్తి మూడు తూముల వద్ద నుండి బలభద్రపురం, ఆర్ఎస్ పేట, బిక్కవోలు, ఇల్లపల్లి (జోడునాదాల తూము) వరకు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సైకిల్, మోటార్ సైకిళ్ళపై ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేసి రోడ్డు దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు టిడిపి ప్రకటించింది.

చిత్రలేఖనం పోటీలు

విశాలాంధ్ర - కాకినాడ : తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కాకినాడ గాంధీనగర్ శాఖ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీలను జూనియర్లు, సీనియర్ల విభాగంలో నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో చదవటం మాకిష్టం అనే అంశం, సీనియర్ విభాగంలో జవహర్లాల్ నెహ్రూ చిత్రపటం ఇవ్వడం జరిగింది. చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 20వ తేదీన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ సందర్భంగా బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ ఉపాధ్యాయులు టీ జయరాం, శ్రీనివాస్, ఎమ్మెస్సీ అగ్రికల్చర్ స్కాలర్ బత్తిన పవిత్ర, లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు దేహ దృఢత్వం అవసరం

విశాలాంధ్ర - నిడదవోలు : నేటి యువతకు మేదస్సుతోపాటు దేహ దృఢత్వం అవసరమేనని రాయల్ ఫిట్నెస్ జిమ్ నిర్వాహకులు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో రాయల్ ఫిట్నెస్ జిమ్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా జిమ్ ఆర్గనైజర్స్ గౌతమ్ జైన్,పినిశెట్టి ఫణి,దాకే అనిల్ కుమార్, రాకేష్ ఆధ్వర్యంలో మిస్టర్ నిడదవోలు బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో నిడదవోలుకు చెందిన బాడీ బిల్డర్స్ ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ దేహ దారుఢ్యాన్ని ప్రదర్శించారు. ఈ పోటీలలో గెలుపొందిన మిస్టర్ నిడదవోలు విజేత జువ్వల ప్రవీణ్‌కు నిడదవోలు పట్టణ తెలుగు యువత అధ్యక్షులు కారింకి సాయిబాబా 30 వేల రూపాయల క్యాష్ ప్రైజ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీనివాస్, కారింకి నాగేశ్వరరావు,వైసీపీ నాయకులు ఎండి ఫయాజ్, తోలేటి కోటి,నిడదవోలు నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం గౌరవ అధ్యక్షులు పాలేటి శ్రీనివాసు, సరిపల్లి రమణ, చెట్టే రామకృష్ణ, వారియర్స్ జిమ్ అధినేత బొత్స కృష్ణ,చిడగం సాయికుమార్, రిపోర్టర్స్ గంగాధర్, ఇబ్రహీం, జిమ్ సభ్యులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : 18 సంవత్సరాలు నిండిన వారు తప్పకుండా ఓటును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం వివిఎస్ విద్యాసంస్థల్లో ఉన్న కాలేజీలో విద్యార్థిని, విద్యార్థులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 01.01.24 నాటికి 18 సంవత్సరాల నుండి తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకుని రానున్న ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. దేశ పరిపాలన శాసించే హక్కు విద్యార్థులకు ఉందని అవగాహన కల్పించారు.

మధురతలేని మధ్యాహ్న భోజనం?

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్: మధురం లేని మధురాన్నం విద్యార్థులకు ఎందుకు పెడుతున్నారని, దానివల్ల విద్యార్థులకు ఉపయోగం ఏమిటని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనరాయణ ఉపాధ్యాయులను ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అదే సమయంలో విద్యార్థులు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులను భోజనం ఎలా ఉందని, మెనూ ప్రకారం ఆహారం అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. భోజనం పాఠశాలలో బాగుందా ? ఇంటివద్ద బాగుందా ? అని విద్యార్థులను ప్రశ్నించారు. మెనూ ప్రకారం ఇవ్వాల్సిన వెరుశనగ చిక్కీలు ఇవ్వక పోవడంపై ఉపాధ్యాయులను ప్రశ్నించారు. అన్నం కూడా ముతకగా ఉండటం, కూర పలచగా ఉండడాన్ని ఆయన గమనించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్య మంత్రి కొట్టు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పోషక విలువలతో ఆహారాన్ని అందించేందుకు కోట్లాది రూపాయలు అందిస్తున్నదన్నారు. దానిని దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందిం చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శ్యామ్యూల్, ప్రధానోపా ధ్యాయులు సత్యనారాయణ, వైసిపి నాయకులు, వార్డు ఇన్‌చార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధిపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర -భీమవరం: ప్రతి వ్యక్తి ముందుగా వ్యాధి లక్షణాలను గమనించి వైద్య సహాయం పొందితే వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చునని ప్రముఖ న్యూరాలజీ వైద్య నిపుణులు డాక్టర్ బుద్ధరాజు కిరణ్ అన్నారు. జాతీయ ఇపిలిప్స్ దే(మూర్ఛ వ్యాధి దినోత్సవం) సందర్భంగా ఎస్.ఆర్‌కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఇంచార్జ్ డాక్టర్ పి .భువనేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు వాటి తీవ్రత ఏ విధంగా ఉంటుందో వివరించి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు . కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ, ఉపాధ్యక్షులు ఎస్.వి.రంగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.మురళీ కృష్ణంరాజు, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ డాక్టర్ బి హెచ్ వి ఎన్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పత్రికా విలువలకు కృషి చేయూలి

విశాలాంధ్ర-వీరవాసరం: పత్రికా విలువలకు అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలు కృషి చేయాలని సీనియర్ జర్నలిస్ట్ గుండా రామకృష్ణ తెలిపారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా వీరవాసరం వనితా క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పాత్రికేయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాపు వనిత క్లబ్ అధ్యక్షురాలు బి.లక్ష్మీ కళ్యాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జర్నలిస్ట్ హక్కులను ప్రభుత్వాలు నిర్బధంతో అణిచివేస్తున్నాయని పత్రికా స్వేచ్ఛకు ముప్పు రాకుండా ప్రజలే పత్రికా స్వేచ్ఛను కాపాడు కోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆంధ్రజ్యోతి విలేఖరి కుంచే శ్రీరంగనాయకులు, ఈనాడు విలేఖరి నారగన సుధాకర్, ప్రజాశక్తి విలేఖరి మల్లుల జయకృష్ణ, విశాలాంధ్ర విలేఖరి చామకూరి వెంకట నరసింహారావు, గుండా రామకృష్ణ, ఆర్.లాల్ రావులను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కుంచే వేణు, గొర్రె రాధసులోచన, కామిశెట్టి విజయలక్ష్మి, సుబ్బారావు, కరింశెట్టి మూర్తి, బృందావనం నాగేంద్ర, ఉయ్యూరు మురళీకృష్ణ, దాడి కాశీ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నాయకుల ఆశయాలు గుర్తించాలి

విశాలాంధ్ర-వీరవాసరం: జాతీయ నాయకుల ఆశయాలను గుర్తించి ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని ప్రయోజకులుగా ఎదగాలని సర్పంచ్ గెద్దం భారతి అన్నారు. మండలంలోని రాయకుదురు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు పఠనాశక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించుటకు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు అధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యులు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూ జీవితంలో అనేక సంఘటనలను వివరించారు. అంతకుముందు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. అనంతరం ఇటీవల జరిగిన జాతీయ అథెటిక్స్ లాంగ్ జంప్ అండర్-23 విభాగంలో స్వర్ణపతకం సాధించిన వీరవాసరా నికి చెందిన రావాడ కుసమను జూనియర్ అసిస్టెంట్ బోను దుర్గాప్రసాద్ రూ.5000 నగదు మరియు మెమోంటోతో ఘనంగా సత్కరించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరవల్లి నాగేశ్వరరావు, కాయల వీరాస్వామి, పి.గురుమూర్తి, అంగర వేణు, సాకా వరప్రసాద్, కె.వి.డి.ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు వి.శ్రీనివాసరాజు, హానోకు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్యం - ఆరోగ్యవంత సమాజం

విశాలాంధ్ర -ముదినేపల్లి : సంపూర్ణ పారిశుధ్యంతో ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించుకోవచ్చని హెచ్ఎం వై విజయ్ కుమార్ పేర్కొన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ముదినేపల్లి శాఖ గ్రంథాలయంలో నాల్గవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని ఎం శ్రీదేవి విద్యార్థులకు స్వచ్ఛభారత్ లో పౌరుల పాత్ర , బాణాసంచా వినియోగంపై లాభ నష్టాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిధర్ , సురేష్ , లక్ష్మికుమారి , రేణుక , శివరంజని , జడ్పీ స్కూల్ , ఇండోసాక్సన్ , లిటిల్ ఫ్లవర్ , సహాయమాత విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో క్విజ్ పోటీలు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : స్థానిక శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథ పాలకురాలు యు. రాములు ఆధ్వర్యంలో విద్యార్థుల మేధస్సును పరీక్షించే క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు 44 మంది విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం ఊటుకూరి వరప్రసాద్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర పొగాకు బోర్డు చైర్మన్‌ను కలిసిన గాంధీ

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : కేంద్ర పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్‌ను జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-1 అధ్యక్షులు ఘంటసాల గాంధీ రైతులు గోపాలపురం పొగాకు బోర్డులో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఘంటసాల గాంధీ మాట్లాడుతూ పొగాకు పండించే రైతులకు ఎరువులపై సబ్సిడీ జీఎస్టీ ని తగ్గించాలని, ఈ సంవత్సరం కూడా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని యశ్వంత్ కుమార్ ని కోరినట్లు ఆయన తెలిపారు. పొగాకు బోర్డు అధికారులు సూచనల మేరకు రైతులు పొగాకు పంటలను పండించాలని సూచించారు. యశ్వంత్ కుమార్ ని కలిసిన వారిలో రైతు నాయకులు గద్ద మనుగు సత్యనారాయణ, గద్దె లక్ష్మణరావు, కరాటం రెడ్డి, బాబు, పేరా బత్తుల వెంకటరత్నం ,ముప్పిన సూర్యనారాయణ, తదితర రైతులు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

విశాలాంధ్ర-వీరవాసరం: జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక యంపిడివో కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయి 'జగనన్నకు చెబుదాం' (స్పందన) కార్యక్రమం నిర్వహించారు. వీరవాసరం మండల పరిధిలో ఉన్న గ్రామ ప్రజల నుండి అర్జీలను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి, జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణంగా ప్రతి సోమవారం జిల్లా ప్రధాన కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం నిర్వహించుకుంటున్నామని,ఈ కార్యక్రమం ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో మండల స్థాయిలో కూడా నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందుకున్న విజ్ఞప్తులకు చక్కటి పరిష్కారం అందించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం జగనన్నకు చెబుతాంలో వచ్చిన 72 అర్జీలలో ముఖ్యమైనవి గ్రామంలో అండర్ గ్రౌండు డ్రైనేజీ నిర్వహణలో లోపాలు జరిగాయని, జరిగిన పనులు నిరుపయోగం అయ్యాయని విచారణ చేసి పూర్తి స్థాయిలో పనులు జరిగేలా చూడాలని గ్రామానికి చెందిన వర్ధినీడి వెంకటలక్ష్మి కోరారు. కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి, ఆర్డీవో కె శ్రీనివాసులు రాజు, డిప్యూటీ ట్రైనీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-ఏలూరు: నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా తంగెళ్లమూడి లోని సెయింట్ మిచైల్స్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు సామజిక మాధ్యమాలు - వాటి దుష్పరిణామాలు" అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఏలూరు జిల్లా విద్యాశాఖ ఎ ఎల్ ఎస్ కోఆర్డినేటర్ జి. రాధాకృష్ణ మాట్లాడుతూ పిల్లలు, పెద్దలు సామజిక మాధ్యమాలకు ఎక్కువగా ఆకర్షితులు అవుతున్నారని, ప్రతిరోజు సామజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, ఇంస్టాగ్రామ్, ట్విట్టర్, వాట్సఅప్ మొదలైన మాధ్యమాలు యూట్యూబ్ కి ఆకర్షితులు అవుతున్నారని, వీటివల్ల యువతకు బాలలకు మంచి కంటే చెడె ఎక్కువగా జరుగు తుందన్నారు. వీటిని నియంత్రించే పద్ధతులు అవగాహన కలిగించాలన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శి కె రాజేశ్వరి మాట్లాడుతూ వ్యక్తులలో ఒంటరితనం, డిప్రెషన్‌కు సోషల్ మీడియా కారణమవుతుందన్నారు. సోషల్ మీడియా ప్రతికూల ప్రభావాలను అలవాటును నివారించవచ్చన్నారు. అనంతరం నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ బి నెహెమియా మాట్లాడుతూ బాలలకు సామజిక మాధ్యమాలు గురించి అవగాహన పెంపొందించటం కొరకు "సామజిక మాధ్యమాలు - వాటి దుష్పరిణామాలు" అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమములో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ డి రజిత, ఉన్నత పాఠశాల ప్రధానిపాద్యాయులు సిస్టర్ రెజీనా, ఉపాధ్యాయులు అనిత, కిషోర్ బాబు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి జగన్ చేసిన అభివృద్ధే మరల గెలిపిస్తుంది

విశాలాంధ్ర - గణపవరం: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాలుగున్నర సంవత్సరాల్లో రాష్ట్రానికి చేసిన అభివృద్ధే జగన్మోహన్ రెడ్డిని మరల ముఖ్యమంత్రిని ప్రజలు చేస్తారని గణపవరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దండు వెంకట రామరాజు (అర్ధవరం రాము) అన్నారు. శుక్రవారం గణపవరం గ్రామంలో సచివాలయం మూడు పరిధిలో రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ వై నీడ్ జగన్ ఏపీ అనే కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుందని గణపవరం సచివాలయం పరిధిలో కార్యక్రమం చేస్తూ ప్రతి ఇంటికి జగన్ చేసిన సంక్షేమ పథకాలు అభివృద్ధి వివరిస్తూ ఈ రాష్ట్రానికి జగన్ ఎందుకు అవసరం అంటే వివరిస్తున్నామని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ మరోవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ జగన్ ప్రభుత్వం ముందుకు వెళుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మూరా అలంకారం, వైసీపీ మండల కన్వీనర్ దండు రాము,వైస్ ఎంపీపీ సలాది రత్న దుర్గ కుమారి, మూరా భాస్కరరావు, ఎంపీటీసీ బత్తి సీతామహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి గ్రేడ్1దార్ల శివరాం ప్రసాదు, వైసిపి పట్టణ అధ్యక్షుడు రొంగల శ్రీను, ఎండి జానీ, ఎం. రామకృష్ణ, సచివాలయ కన్వీనర్ సలాది నరేష్ ,సచివాలయ సిబ్బంది వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు డాక్టర్ అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు

విశాలాంధ్ర-చింతలపూడి: భారతీయ దళిత సాహిత్య అకాడమీ వారు ప్రదానం చేసే బాబా సాహెబ్ డాక్టర్ అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు 2023 సంవత్సరానికి జివిఎస్ శ్రీనివాస్ ఎంపికయ్యారు. జి.వి.యస్. శ్రీనివాస్ ఆంధ్ర ప్రదేశ్ గ్రామ,వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, ఉద్యోగ సంఘం నాయకులుగా ఉన్నారు. ఈయన చేసిన సామాజిక సేవకు, ఉద్యోగుల సమస్యలపై సామాజిక కార్యక్రమాల ద్వారా చేసిన చేసిన కృషికి ఈ జాతీయ అవార్డు కు ఎంపిక చేశారు. ఈ అవార్డు వచ్చే డిసెంబర్ నెలలో 10, 11 తేదీలలో న్యూ ఢిల్లీలో ప్రదానం చేస్తారని ఒక ప్రకటనలో జి.వి.యస్.శ్రీనివాస్ పేర్కొన్నారు. సంఘం గౌరవ అధ్యక్షులు కాకర్ల వెంకట్రామిరెడ్డి, పలువురు ఉద్యోగ సంఘం నాయకులు, బంధువులు, స్నేహితులు ఆయనకు అభినందనలు తెలిపారు.

కులగణనపై సలహాలు స్వీకరణ

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వము చేపట్టిన కుల గణన (కుల సర్వే) కార్యక్రమం ఏలూరు జిల్లాలో నిర్వహించుటకు, కుల గణన పై సలహాలు తీసుకొనుటకు ఏలూరు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, సంబంధిత జిల్లా అధికారులు, కుల ఆధారిత కార్పోరేషన్ ల చైర్మన్స్ , డైరక్టర్స్ లతో నేడు గం.10.00 లకు, జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరము, జిల్లా స్థాయి సమావేశం కలెక్టర్, వె. ప్రసన్న వెంకటేష్ చే నిర్వహించబడుతుందని జెడ్పి సిఇఓ కె.ఎస్.ఎస్. సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు.

నాయకుల అరెస్టులు అన్యాయం

విశాలాంధ్ర- ముసునూరు: ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం నూజివీడులో భూపట్టాలు హక్కు పత్రాలు కార్యక్రమానికి విచ్చేస్తున్న సందర్భంగా ముసునూరు మండలంలోని టిడిపి నాయకులు గద్దె రఘుబాబు, రమణక్కపేట గ్రామానికి చెందిన జనసేన నాయకులు పాశం నాగబాబు, మరీదు శివరామకృష్ణ, ముమ్ములనేని సునీల్ కుమార్, బండారు రాజు, నూజివీడు మండల సిపిఎం కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహాలను సిఎం పర్యటన సందర్భంగా పోలీస్ స్టేషంలో పోలీసులు అక్రమంగా ఆరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం పర్యటన నేపథ్యంలో వామపక్ష నాయకులను,ప్రజా సంఘాల నేతలను,ప్రతి పక్ష నేతలను ఆరెస్టు చేయడం ఆన్యాయమన్నారు.

గల్ఫ్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

-సిఐ గోవింద రాజు

విశాలాంధ్ర - రాజోలు : గల్ఫ్ మోసాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజోలు సిఐ అర్ గోవింద రాజు అన్నారు. శుక్రవారం రాజోలు అంబేద్కర్ భవనంలో ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపిఎన్ఆర్టీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన గల్ఫ్ దేశాలకు వెళ్ళే కార్మికులు, ఉద్యోగుల సక్రమ వలసపై అవగాహన సదస్సుకు సిఐ గోవిందరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భగా అయన మాట్లాడుతూ కోనసీమ ప్రాంతంలో ఉపాధి రీత్యా గల్ఫ్ వెళ్ళే వారి సంఖ్య ఎక్కువగా ఉందని అన్నారు. ఎక్కువ శాతం నిరక్షరాస్యులు అవడం వల్ల ఏజెంట్లు, దళారుల చేతిలో మోసపోతున్నారని అన్నారు. ఇదే అదునుగా కొంత మంది నకిలీ ఏజెంట్ల అవతారమెత్తి అమాయకుల వద్ద డబ్బులు గుంజు కోవడం, మహిళల అక్రమ రవాణా, తప్పుడు వీసాలు జారీ చేయడం చేస్తున్నారని అన్నారు. గత నెల రోజుల వ్యవధిలో తాను గల్ఫ్ బాధితులకు సంబంధించి రాజోలు సర్కిల్ పరిధిలో నాలుగు కేసులు పరిష్కరించానని అన్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్ళే వలస కార్మికులకు ఏపిఆర్టీఎస్ అండగా నిలిచి ఉపాధి, ఉద్యోగ భద్రతపై అవగాహన కల్పించడం, వారిని చైతన్య వంతులు చేయడం అభినందనీయమన్నారు. ఏపిఎన్ఆర్టీఎస్ డిప్యూటీ డైరెక్టర్ కరీమ్ మాట్లాడుతూ విదేశాలకు వెళ్లే వలస కార్మికుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అక్రమ వలసలు, నకిలీ ఏజెంట్లు పని విధానం, ప్రవాస్ కౌశల్ వికాస్ యోజన పథకం, ప్రవాస్ భారతీయ భీమా యోజన, సురక్షిత వలసలు వెళ్ళడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి, రాజోలు ఎస్ఐ పృథ్వి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, స్థానిక నాయకులు గుబ్బల శ్రీనివాస్, ఏపీ ఎన్ఆర్టీఎస్ అడిషనల్ డైరెక్టర్ కళ్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల భవిష్యత్తుకు భరోసా యాత్ర

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ సిటిలో జనసేన పార్టీ కాకినాడ సిటి ఇన్‌చార్జి ముత్తా శశిధర్ నాయకత్వంలో భవన నిర్మాణ కార్మికుల భవిష్యత్‌కి హామీ యాత్ర కొండయ్య పాలెం శారదాంబ గుడి ప్రాంతంలో టివివి సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ శ్రేణులు భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడి వారి కష్టాలపై సమాచారం అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణ కార్మికులంటే ఒక వ్యవస్థ అని, ఇందులో రక రకాల కులాలు మతాల వారందరు పనులు చేసుకుంటూ వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటూ ఉంటారని తెలిపారు. అలాంటి వ్యవస్థ వైసిపి ప్రభుత్వ అడ్డదిడ్డమైన నిర్ణయాలతో చిన్నాభిన్నం అయిపోయిందన్నారు. భవన నిర్మాణ కార్మికుల శ్రేయస్సు కోసం జనసేన, తెలుగుదేశంలు ఉమ్మడి మేనిఫెస్టోలో ఉచిత ఇసుక విధానంతో పాటుగా ముఖ్యమైన ప్రతిపాదనలు చేపడుతున్నాయని కార్మికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు నాగరాజు, కటారి శ్రీను, రవి, సుబ్బారావ్, గుర్రాల జాన్, శేఖర్ మరియు కాకినాడ సిటి జనసేన నాయకులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ వాహనాలపై మోదీ ఫొటో అమర్చాలి

విశాలాంధ్ర-కొవ్వూరు: ప్రతి సంవత్సరం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 60 శాతం కంటే ఎక్కువ మంది పేదలకు రూ.6000 కోట్ల వ్యయంతో 17 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలను రేషన్ అందిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆహార ధాన్యాలు పంపిణీ చేస్తున్న 9260 రేషన్ వాహనాలకు అందించే సబ్సిడీలో 60 శాతం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రేషన్ ద్వారా ఆహార ధాన్యాలు అందజేస్తున్న రేషన్ పంపిణీ వాహనాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోటో లేకపోవడాన్ని భారతీయ జనతా పార్టీ యువమోర్చా తీవ్రంగా ఖండిస్తున్నదని బిజెపి యువమోర్చ జిల్లా ఉపాధ్యక్షులు గోపిశెట్టి శివకృష్ణ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించకుంటే, అధ్యక్షుడి నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని వాహనాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటోలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల యువ మోర్చా అధ్యక్షుడు బెల్లపు కొండ మణికంఠ, యువ మోర్చా నాయకులు ప్రత్తి మణికంఠ, కొల్లి మణికుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : విద్యార్థి దశ నుంచే ప్రతీ ఒక్కరూ సమీప గ్రంథాలయాల్లో పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ప్రథమ శ్రేణీ శాఖా గ్రంథాలయంలో శుక్రవారం..నాల్గవ రోజు నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల సదస్సులో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనంలో అభ్యుదయ కవి చల్లా విశ్వనాథం. జ్యోస్యుల కృష్ణబాబు, భళ్లమూడి సూర్యనారాయణ. కొత్త శివ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి కనపర్చాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాహిత్యం దాని అవసరం. ఎంతో ఉందన్నారు. తెలుగు భాష గొప్పతనం, కంద పద్యాలు ఆలపించి కవులు ఇచ్చిన సందేశాలు వివరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ లలిత, సింగం బుల్లియ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - తాళ్ళపూడి : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బాల్యం నుండి విద్యార్థులకు గ్రంథాలయం పట్ల ఆసక్తి అనే కార్యక్రమంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ రామారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్య దశ నుంచి రోజుకు కనీసం ఒక గంట గ్రంథాలయ పుస్తకాలతో గడపాలని అన్నారు. లైబ్రరీలో వివిధ రకాల పుస్తకాలను విద్యార్థి దశ నుంచి చదవడం వల్ల అనేక కొత్త విషయాలు తెలుస్తాయని అన్నారు. అనంతరం పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో భాగంగా కవుల గురించి సెమినార్ ఏర్పాటు చేశారు. తెలుగు పండితులు సిహెచ్ తరుణ్ కుమార్, విద్యార్థులకి పూర్వకవులు, నవీన కవులు, ఆధునిక కవులు గురించి వివరించారు అనంతరం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథ పాలకుడు ఎ. నరేష్ విద్యార్థిని విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పోషకాహారంపై చేతులు కలిపిన న్యూట్రిసో, ఎన్జీఓ సర్వాణి

విశాలాంధ్ర-కాకినాడ : సర్వాణి పాఠశాలకు అధికారిక పోషకాహార భాగస్వామిగా ఎన్జీఓ సర్వాణితో న్యూట్రిసో తన భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ సహకారం, ప్రఖ్యాత భారతీయ బాస్మతీయేతర బియ్యం ఎగుమతి సంస్థ అయిన సీఎల్ఆర్కే ఇండ ట్రేడ్ ప్రైవేట్ లిమిటెడ్ అనుబంధ బ్రాండ్ న్యూట్రిసోతో తయారు చేసిన భోజనాన్ని సర్వాణి పాఠశాలలో 120 మంది విద్యార్థులకు అందించేందుకు వీలు కల్పిస్తుంది. భారతదేశంలో పోషకాహార లోపం సమస్యను పరిష్కరించడం, పోషకాహార సమస్యను ఎదుర్కోడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపునకు మద్దతుగా ఉండడం ఈ కార్యక్రమ లక్ష్యం. న్యూట్రిసో అనేది భారతదేశంలో పోషకాహార లోపాన్ని ఎదుర్కోవ డానికి రూపొందించబడిన ఒక విప్లవాత్మక మల్టీవిటమిన్ బియ్యం. ఫోర్టిఫికే షన్ కచ్చిత మైన ప్రక్రియ ద్వారా, న్యూట్రిసో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ)చే ఆమోదించబడిన అవసరమైన సూక్ష్మపోషకాలతో సమృద్ధిగా ఉంటుంది.

చిన్నాయగూడెంలో పల్లెనిద్ర

విశాలాంధ్ర-దేవరపల్లి: గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గురువారం రాత్రి దేవరపల్లి మండలం చిన్నాయగూడెం లో పల్లె నిద్రకు ఉపక్రమించారు. రాష్ట్రానికి జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమం ముగించుకొని పల్లెబాటలో భాగంగా వెంకట్రావు మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు గ్రామాలలో పర్యటించి ప్రజలతో మమేకమై వారి కష్ట సుఖాలు తెలుసుకుంటున్నట్లు తెలిపారు గ్రామస్తులతో స్థానిక సమస్యలు, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించినట్టు తెలిపారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావుతో పాటు దేవరపల్లి మండల వైసీపీ అధ్యక్షుడు దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు, జగదీష్, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో వైఎస్సార్సీపీ విఫలం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : రాష్ట్రంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో వైఎస్ఆర్సిపి పార్టీ విఫలమైందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ ఎన్ వర్మ అన్నారు. శుక్రవారం ఉప్పాడలో బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ మన ఇంటికి మన వర్మ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పాడలో ఎక్కడ చూసినా డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని పారిశుధ్యం తాండవం చేస్తుందని అన్నారు. ప్రజలు రోగాల బారిన పడుతున్న పట్టించుకోవటం లేదని వాపోయారు. గ్రామాలలో సక్రమంగా త్రాగునీరు అందివ్వలేక పోవడంతో సొమ్ములు వెచ్చించి ఆర్వో ప్లాంట్ల వద్ద త్రాగునీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఈ ప్రభుత్వంలో ఏర్పడిందని తెలిపారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ టిడిపి ప్రభుత్వం వస్తే సంక్షేమ సూపర్ సిక్స్ పథకాలను మత్స్యకారులకు వివరించారు. వైఎస్ఆర్సిపి నాలుగు సంవత్సరాల పాలనలో అభివృద్ధికి ఆమడ దూరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి కృష్ణారెడ్డి, చోడిపల్లి ప్రసాద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు వైసీపీ సహాయం

విశాలాంధ్ర-గోకవరం : గోకవరం మండలంలోని గోకవరం గ్రామంలో సంజీవ్ నగరంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వస్వం కోల్పోయిన బాతు కుమారి, దొంకా రఘుపతిమ్మలను ఎమ్మెల్యే తండ్రి జ్యోతుల రామస్వామి బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాధితులు ఒక్కొక్కరికి 5000 రూపాయల నగదు అందజేయగా గోకవరం జడ్పీటీసీ, గోకవరం ఎంపీపీ ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం, కూరగాయలు అందజేశారు. పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు మచ్చా మోహన్, బిజ్జి రాజు, అంబటి ప్రసన్నకుమార్, ఎంపీటీసీ తోలేటి రమ్య శ్రీ ప్రసాద్, బదిరెడ్డి మెహర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

4 రాష్ట్రాలకు ఆర్చ్ బిషప్‌గా మైఖేల్ బ్రౌన్

విశాలాంధ్ర - తాళ్ళపూడి : ప్రపంచ క్రైస్తవ సంఘములు చేత గుర్తించబడిన సెల్టిక్ క్రాస్ మినిస్ట్రీస్ ఆఫ్ ఇండియా వారు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సా మరియు మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఆర్చ్ బిషప్ గా దైవజనులు తమిళనాడులోని కోటగిరిలో జరిగిన సమావేశంలో నియమితులయ్యారు. వీరు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఐ పంగిడి గ్రామంలో ఐక్య క్రీస్తు నిబంధన సంఘ పరిచర్య చేస్తూ వేదాంత విద్యను న్యూ జెరూసలేం ఇంటర్నేషనల్ బైబిల్ థియోలాజికల్ కాలేజీని స్థాపించి నడిపిస్తున్నారు. సెల్టిక్ క్రాస్ మినిస్ట్రీస్ ఆఫ్ ఇండియా సీనియర్ ఆర్చ్ బిషప్ మరియు చైర్మన్ డాక్టర్ శ్యామ్ జయ కుమార్, ప్రధాన కార్యదర్శి రెవ. డాక్టర్ అనీష్ లు నాలుగు రాష్ట్రాల్లో ఆర్చ్ బిషప్ గా బ్రౌన్ నియమించి ఉన్నారు. ఈ సందర్భంగా మైఖేల్ బ్రౌన్ మాట్లాడుతూ దేవుడు తనకు ఇచ్చిన ఈ గొప్ప అధికారం లను గొప్ప బాధ్యతగా భావించి నాలుగు రాష్ట్రాలలో బిషప్పులను నియమించి దేవుని సువార్తను తెలియజేస్తానన్నారు.

అధికారులతో ఎంపీడీవో సమావేశం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల పరిషత్ కార్యాలయంలోని పంచాయతీ కార్యదర్శులతో, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో, డిజిటల్ అసిస్టెంట్ లతో, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లతో ఎంపిడిఓ నాతి బుజ్జి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ నాతి బుజ్జి మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న ఈకెవైసిలను త్వరితగతిన పూర్తి చేయవలసినదిగా వెల్ఫేర్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఈ-సర్వీసుల సొమ్ము, ఓటిఎస్ సొమ్ము వెంటనే జమ చేయవలసినదిగా అందరు డిజిటల్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. ప్రతీ వలంటీరుతో పాటు సచివాలయ సిబ్బంది సమిష్టిగా కుల గణన సర్వే చేయవలసినదిగా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ సచివాలయ సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఇఓ (పిఆర్ మరియు ఆర్‌డి) డి. శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి, పివి ప్రసాదరావు, మండల పరిషత్ పరిపాలనాధికారి టివి సురేంద్ర రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులతో ఎంఈఓ సమావేశం

విశాలాంధ్ర - కరప : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో కరప మండల ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యా యులతో యాన్యువల్ వర్క్‌ప్లాన్ బడ్జెట్లో భాగంగా సమావేశం నిర్వహించినట్టు మండల విద్యాశాఖ అధికారి కెబి కృష్ణవేణి తెలిపారు. స్కూల్ ఆవాసంలో ఒకే వయసు పిల్లలకు అవసరమగు వివిధ రకాల వస్తువులు, బెంచీలు, కుర్చీలు, పిల్లల హాజరు మొదలగు వాటిపై నివేదికలు సమర్పించాలని ఉపాధ్యాయులకు చెప్పడం జరిగిందని ఎంఈఓ కృష్ణవేణి తెలిపారు. ఎంఈఓ 2 పి సత్యనారాయణ, కంప్యూటర్ ఆపరేటర్ వి.అనంతలక్ష్మి, మిస్ కో ఆర్డినేటర్ జి. చంద్రలేఖ, రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారని తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : తాళ్ళపూడి మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యం లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పెద్దేవం గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షులు కుంటముక్కల వీరభద్రరావు ప్రారంభించారు. పూర్వపు అధ్యక్షులు మార్ని బుజ్జి, వై.సి.పి నాయకులు తోట రామ కృష్ణ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. లయన్స్ శ్రీమతి రాజేశ్వరి రామకృష్ణన్ ద్వారా ఉచిత పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు ఉచితంగా చేస్తామన్నారు. 110 మంది పరీక్షలు చేయించుకోగా 20 మందికి అపరేషన్లకు గుర్తించామని డా.నాగరాజు తెలిపారు. సిబ్బంది శ్రావణి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.